హయత్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధర్మ రక్ష సమితి, బీజేపీ నాయకులు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

హయత్‌నగర్, ఆగస్టు 12: బంగ్లాదేశ్ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం హిందూ ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి నిరసన ర్యాలీ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన ఆందోళనలను పక్కదారి పట్టించి హిందువులనే లక్ష్యంగా చేసుకుని వందలాది మంది హిందువులను హతమార్చడం, అత్యాచారాలు చేయడం, హిందూ దేవాలయాలను ధ్వంసం చేయడం వంటివి చోటుచేసుకోవడం దారుణమన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిడెన్ హంటర్స్ క్రికెట్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న హిడెన్ హంటర్స్ క్రికెట్ అసోసియేషన్ జట్టు సభ్యులు

వనస్థలిపురం, ఆగస్టు 12: హిడెన్ హంటర్స్ క్రికెట్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్ రెబ్బవరపు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఏడాది కింద అసోసియేషన్, జట్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ సంస్థ ద్వారా రేపటి క్రీడాకారుకు సహకారం అందిస్తున్నామన్నారు. చిన్నారుల్లో ఉన్న ఆసక్తి, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏడాది పొడవునా పలు చోట్ల టోర్నమెంట్‌లు నిర్వహించడంతోపాటు, తమ సంస్థ తరపునా రాష్ట్ర వ్యాప్తంగా టోర్నీల్లో పాల్గొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తమ్ముడబోయిన శివకుమార్, రామ్, పరుచూరి గోపాల్, రాకేశ్‌రెడ్డి, రాజు యాదవ్, మద్దెల గోపీచంద్, మానస్ ప్రసాద్, రుక్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఎల్బీనగర్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టీ చర్స్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వనస్థలిపురం, ఆగస్టు 12: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అక్షర విద్యా సంస్థల సీఈవో మదన్ మోహన్ అన్నారు. సోమవారం ఎల్బీనగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం ఇన్వెస్టి చర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు భవిష్యత్తులో అవసరమయ్యే అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే నాయకత్వం వహించే అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ వేడుకల్లో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పాల్గొన్న దృశ్యం

మన్సూరాబాద్, ఆగస్టు 12: విద్యార్థులకు తరగతి గదిని క్రమశిక్షణగా ఉంచే అధికారం ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో లీడర్ షిప్ అధ్యయనానికి నాంది పలికే ఈవెంట్ (ఇన్వెస్టిట్యూర్) వేడుకలను ఘనంగా నిర్వహించారు. చురుకైన కొందరు విద్యార్థులకు పాఠశాలలోని కొన్ని విభాగాల బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ముందే ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే ఉత్తమ పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జోనల్ ఇన్‌చార్జి రమేశ్ చంద్ర, బ్రాంచ్ డైరెక్టర్ రవిప్రసాద్, డైరెక్టర్ రాధా, ప్రిన్సిపాల్ పరిమళ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గృహిణి మృతి

హయత్‌నగర్, ఆగస్టు 12: చికిత్స పొందుతూ ఓ గృహిణి మృతిచెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంచాల మండలం, ఆరుట్ల గ్రామానికి చెందిన బండారి శ్రీలత(27)కు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండిచెరువు గ్రామానికి చెందిన బండారి శ్రీశైలంతో 2018లో వివాహం జరిగింది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని పాపిరెడ్డి లేఅవుట్‌లో శ్రీలత, శ్రీశైలం దంపతులు నివాసముంటున్నారు. వీరికి 11 నెలల బాబు జన్మించాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురైన శ్రీలత ఈనెల 5న ఇంట్లోని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శ్రీలత ఆదివారం రాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

మన్సూరాబాద్, ఆగస్టు 12: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, బీకేరెడ్డి కాలనీ, వెంకటరమణకాలనీలో బీవీఎన్ అరుణ్‌కుమార్, భాగ్యలక్ష్మి దంపతులు నివాసముంటున్నారు. వీరికి సచిన్ అనే కుమారుడు ఉన్నాడు. భాగ్యలక్ష్మి ఆరు సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతుంది. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్న ఆమె తరచూ తనకు తలెత్తుతున్న అనారోగ్య సమస్యలపై మనోవేదన చెందేది. భాగ్యలక్ష్మి భర్త అరుణ్‌కుమార్ పని నిమిత్తం సోమవారం ఉదయం బయటకు వెళ్లాడు. తిరిగి ఆయన ఇంటికి వచ్చి చూసే సరికి భాగ్యలక్ష్మి చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. ఆమెను కిందకు దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న కారణంగానే తన సోదరి మృతి చెందిందని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట/కందుకూరు, ఆగస్టు 12: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. కందుకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 66మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.17.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. చెక్కులను మీర్‌పేట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సోమవారం పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పేదలను ఆదుకోవడానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకోవడానికి కృషి చేయాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ లాంటి పథకాలను చిన్నచూపు చూడకుండా ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపి రెడ్డి విజేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ర్యాపాకు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మండల మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, కాకి రాములు, యూత్ మండల అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సురుసాని శేఖర్‌రెడ్డి, దేవీలాల్ నాయక్, పాండు, సామ ప్రకాశ్‌రెడ్డి, సురుసాని సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కాసుల రామకృష్ణారెడ్డి, గోవర్ధన్, బ్రాహ్మణపల్లి జ్యోతి శేఖర్, రామంజనేయులు, రామకృష్ణ, గుయ్యని సామయ్య, నందీశ్వర్, కొండల్‌రెడ్డి, దేశం కృష్ణారెడ్డి, తల్లొజు లక్ష్మాణాచారి, తేజ నాయక్, మనోహర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫలహార బండి ఉరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గుప్తా

సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఆర్కేపురం, ఆగస్టు 12 : ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని బీఆర్ఎస్ ఆర్కేపురం డివిజన్ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గుప్తా తెలిపారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేజ్-2, మార్గదర్శి కాలనీ, సౌభాగ్యపురం కాలనీలో నిర్వహించిన ఫలహార బండి ఉరేగింపు కార్యక్రమానికి శ్యాంసుందర్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పాలనలో గుర్తింపునకు నోచుకోని తెలంగాణ పండుగలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పండుగలకు మంచి గుర్తింపు తీసుకురావడంతో అధికారికంగా నిర్వహించారని గుర్తు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీకలుగా నిలుస్తాయని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఎర్ఎస్వీ అధ్యక్షులు పగడాల దీపక్, శ్రీకాంత్‌యాదవ్, నరేంద్రనాయక్, కిల్లాలోకి, కపిల్‌దేవ్, శిశాల్‌దేవ్ తదితరులు ఉన్నారు.

వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఏ, బీకాం, బీబీఏ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

కామర్స్ విభాగం హెడ్‌గా ప్రొ.గంగాధర్



ప్రొఫెసర్ గంగాధర్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: ఓయూ కామర్స్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ ఎం.గంగాధర్ నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. విభాగం ప్రారంభమైనప్పటి నుంచి ఎనిమిది దశాబ్దాల్లో తొలిసారి ఎస్టీ (ఎరుకల) సామాజికవర్గానికి చెందిన వ్యక్తి హెడ్‌గా బాధ్యతలు స్వీకరించడం విశేషం. కార్యక్రమంలో మాజీ హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్లు ఐ.శేఖర్, నరేశ్‌రెడ్డి, ప్యాట్రిక్, సీవీ రంజని, కవితాదేవి, డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్. డాక్టర్ బి.సంధ్య, డాక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు ప్రొఫెసర్ గంగాధర్‌ను అభినందించారు.

వరదనీటి కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, అధికారులు

వరదనీటి కాల్వ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి

హయత్‌నగర్, ఆగస్టు 12: డివిజన్ పరిధిలో చేపడుతున్న వరదనీటి కాల్వ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లోని హైకోర్టు కాలనీలో జరుగుతున్న వరదనీటి పైపులైన్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రస్తుతమున్న వరదనీటి కాల్వలో షిల్ట్‌ను వీలైనంత త్వరగా శుభ్రపర్చాలని, వర్షాలకు నీటి ప్రవాహం పెరిగి మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లే ప్రమాదముందని తెలిపారు. ఈ పర్యవేక్షణలో డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, నాయకులు పారంద మహేశ్, సతీశ్, ఆకుల అరుణ్, తదితరులు ఉన్నారు.

నమ్మించి.. బంగారు నగలతో మహిళ పరార్

మన్సూరాబాద్, ఆగస్టు 12: మాయ మాటలతో మచ్చిక చేసుకుని ఓ వ్యక్తి వద్ద నుంచి బంగారు నగలను మహిళ అపహరించుకుపోయిన ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాల ప్రకారం.. ఏపీ, నెల్లూరు జిల్లా కావలికి చెందిన షేక్ విజయ్‌సాగర్ వ్యాపారం చేస్తుంటాడు. సమీప బంధువు వివాహం సందర్భంగా షాపింగ్ కోసం నగరానికి వచ్చి ఎల్బీనగర్, రాక్‌టౌన్‌కాలనీలో నివాసముండే సోదరుడి రూమ్‌లో ఉన్నాడు. సోదరుడి స్నేహితురాలైన ఓ మహిళ విజయ్‌సాగర్‌కు ఫోన్ చేసి ఓ పని నిమిత్తం మిమ్మల్ని కలవాలని కోరింది. సదరు మహిళను ఎల్బీనగర్ రావాలని కోరగా.. ఈ నెల 9న వస్తున్నానని ఫ్రెష్ అయ్యేందుకు ఓ హోటల్ రూమ్‌ను బుక్ చేయాలని కోరింది. ఎల్బీనగర్, శ్రీకర హాస్పిటల్ ఎదురుగా ఉన్న విరాట్ గ్రాండ్ హోటల్లో రూమ్‌ను బుక్ చేశాడు. ఇద్దరు కలిసి హోటల్‌కు వెళ్లారు. విజయ్‌సాగర్‌తో చనువుగా ప్రవర్తిస్తూ నగలను తీసి వేసి ఫ్రెష్ కావాలని కోరింది. ఆమె మాయమాటలను నమ్మిన అతడు తన వద్ద ఉన్న 4 తులాల బంగారు గొలుసు, 3.5 తులాల బంగారు కడియ, 2.5 తులాల బంగారు ఉంగరాలను టేబుల్‌పై ఉంచి స్నానం చేసేందుకు వెళ్లాడు. ఫ్రెష్ అయి వచ్చిన రూమ్‌లో చూసే సరికి సదరు మహిళ బంగారు నగలతో అక్కడి నుంచి ఉడాయించింది. కంగారు పడిన విజయ్‌సాగర్ సదరు మహిళకు ఫోన్ చేయగా నగలు తన వద్దే ఉన్నాయని ఉదయం వచ్చి ఇస్తానని చెప్పింది. మరుసటి రోజు ఫోన్ చేయగా విజయ్‌సాగర్ నంబర్‌ను ఆమె బ్లాక్ చేసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన విజయ్‌సాగర్ ఆదివారం సాయంత్రం ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నగలతో ఉడాయించిన మహిళ పేరు శ్రీలక్ష్మీగా బాధితుడు పోలీసులకు తెలిపాడు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

సైదాబాద్, ఆగస్టు 12: 77వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే కార్యక్రమాన్ని మంగళవారం సైదాబాద్ రెడ్డిబస్తీ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న గాంధీజీ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రవీందర్ రెడ్డి, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వినోద్ గౌడ్, దినేశ్ గౌలికర్, అరవింద్ గౌడ్, యశ్వంత్, వేదవత్, బండారు నవీన్, పటాలే నవీన్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

గుండు రవికాంత్‌కు డాక్టరేట్

ఆర్కేపురం, ఆగస్టు 12 : 20 సంవత్సరాల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రముఖ సంఘ సేవకులు, అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుండు రవికాంత్‌కు డాక్టరేట్ వరించింది. సౌత్ ఇండియా పాండిచ్చేరిలో నిర్వహించిన యూనివర్సిటీ మహా సదస్సు కార్యక్రమంలో రవికాంత్ సేవలను గుర్తించి యూనివర్సిటీ డైరెక్టర్ గోపి కన్నన్‌కు డాక్టరేట్ అందజేశారు.

ప్రైమరీ స్కూల్‌ను సందర్శించిన ఎంఈఓ

చంపాపేట ప్రైమరీ స్కూల్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ బాసునాయక్

చంపాపేట, ఆగస్టు 12: ఇటీవల సరూర్‌నగర్ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన బాసునాయక్ సోమవారం చంపాపేటలోని మండల పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యాబోధనల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమయంలో ప్రధానోపాధ్యాయుడు మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు అజిత, రజిత, జ్యోతి, ఎన్.అజిత, వినయ్‌కుమార్, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐటీఐలో నిర్వహించిన భూవిజ్ఞాన శాస్త్రంలో అంతరిక్ష సాంకేతికత ఉపయోగాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్ఐటీఐ డైరెక్టర్ డాక్టర్ నిషారాణి, అడ్వాన్స్‌డ్ డేటా ప్రాసెసింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రాధాదేవి తదితరులు

అంతరిక్ష సాంకేతిక ఉపయోగాలపై అవగాహన

మన్సూరాబాద్, ఆగస్టు 12: ఎల్బీనగర్, బండ్లగూడలోని భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ (జీఎస్ఐటీఐ)లో సోమవారం భూవిజ్ఞాన శాస్త్రంలో అంతరిక్ష సాంకేతికత ఉపయోగాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాబాయ్ 105వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎస్ఐటీఐ డైరెక్టర్ డాక్టర్ నిషారాణి, అడ్వాన్స్‌డ్ డేటా ప్రాసెసింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రాధాదేవి ముఖ్య అతిథులుగా హాజరై భూవిజ్ఞాన శాస్త్రంలో స్పేస్ టెక్నాలజీ ఆవశ్యకత దాని వలన కలిగే ఉపయోగాలపై వివరించారు. ఇండియన్ స్పేస్ ప్రొగ్రామ్, స్పేస్ అప్లికేషన్స్ యొక్క పరిణామం, భూవిజ్ఞాన శాస్త్రంలో అంతరిక్ష సాంకేతికత, చంద్రయాన్-3 ల్యాండింగ్ సైట్ జియాలజీ, అంతరిక్ష సాంకేతిక వినియోగం కోసం జీఎస్ఐ యొక్క శిక్షణా ప్రయత్నం తదితర అంశాలపై వారు సందేశం ఇచ్చారు. తాము చేపట్టిన కార్యక్రమాలను ఆగస్టు 22, 23 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే నేషనల్ స్పేస్ డే-2024 వేడుకల్లో ప్రదర్శించండం జరుగుతుందని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విద్యార్థులు, నల్లమల్లారెడ్డి కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విద్యార్థులతో పాటు ఇతర పాఠశాలలకు చెందిన సుమారు 250 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఓఐఎస్‌కి చెందిన డాక్టర్ బాలకృష్ణన్, ఐఎస్ఆర్ఓకి చెందిన డాక్టర్ ఈశ్వర్ చంద్రదాస్, ఎన్జీఆర్ఐకి చెందిన డాక్టర్ సెంథిల్‌కుమార్, జీఎస్ఐటీఐ డైరెక్టర్ ఆర్. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన 33 కేవీ విద్యుత్ వైర్

పరుగులు పెట్టిన పాదచారులు, వాహనదారులు

మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ఆయిల్ మిల్ వద్ద 33 కేవీ విద్యుత్ వైర్ తెగిపడిన దృశ్యం

మన్సూరాబాద్, ఆగస్టు 12: ఎల్బీనగర్, మన్సూరాబాద్‌లో 33 కేవీ విద్యుత్ వైర్ తెగి రోడ్డుపై పడి పోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది. మన్సూరాబాద్ చౌరస్తా నుంచి కామినేని చౌరస్తాకు వెళ్లే మార్గంలో ఉన్న ఆయిల్ మిల్ వద్ద సోమవారం మధ్యహ్నం తొలుత భారీ పేలుడు శబ్దం వచ్చింది. దీంతో ఒక్కసారిగా వాహనదారులు, ప్రజలు చూస్తుండగానే ఆ మార్గంలో 33 కేవీ విద్యుత్ వైర్ తెగి రోడ్డుపై పడింది. విద్యుత్ వైర్ రోడ్డుకు ఒక పక్కన పడి పోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విషయాన్ని గమనించిన వాహనదారులు, పాదచారులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో హోటళ్లు, వైన్స్, బార్, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. విద్యుత్ వైర్లు తెగి పడిన విషయాన్ని స్థానికులు వెంటనే ఆటోనగర్‌కు చెందిన టీజీపీడీసీఎల్ అధికారులకు తెలిపారు. విద్యుత్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై 33 కేవీ లైన్లను పర్యవేక్షించే లైన్స్ వింగ్ అధికారులకు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 15 రోజుల కిందట మన్సూరాబాద్ ఏరియాలో ఇలాంటి ఘటనే చోటు చేసుకున్నప్పటికీ విద్యుత్ అధికారుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. 33 కేవీ లైన్లను పర్యవేక్షించే లైన్స్ వింగ్ అధికారులు వెంటనే ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై లైన్స్ వింగ్ ఏడీని వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవు



ఓపెన్ నాలాలో చెత్త వేసిన వ్యక్తికి రూ.500 జరిమానా వేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి

బడంగ్‌పేట, ఆగస్టు 12: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి హెచ్చరించారు. బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు ఓపెన్ నాలాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి రూ.500 జరిమానా వేయడం జరిగిందన్నారు. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు వేస్తున్నామని.. కాలనీ ప్రజలు ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సీజనలు వ్యాధులు వ్యాపించకుండా కాలనీవాసులు, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాలు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరులో సభ్యత్వం చేస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ తెలిపారు. కందుకూరు, లేమూరు, తిమ్మాపూరు, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల, గూడూ